DD9 వార్త
తెలుగు దినపత్రిక
ఆదివారం, సెప్టెంబర్ 21, 2025

# గిరిజనుల అభివృద్ధి ఆదర్శనీయం

- గిరిజనులకు విద్య, వైద్యం, యువతకు స్వయం ఉపాధి, సంక్షేమ పథకాల అభివృద్ధిలో ఐటిడిఏ పిఓ
- బి రాహుల్ ఐఏఎస్ కృషి అభినందనీయం-విశ్రాంత ఐఏఎస్ సుబ్బారావు

3లో

భద్రాచలం, (డి.డి9 వార్త):భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనులు తమ సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడుకుంటూ అభివృద్ధి దిశగా ముందడుగులు వేస్తుండటం ఎంతో ఆనందకరమని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.వి. సుబ్బారావు అభిప్రాయపడ్డారు.





బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాలో..
ఒక్కేసి పువ్వేసి చందమామ..
ఒక్క జామాయె చందమామ..
రామ.. రామ.. ఉయ్యాలో..
రామనే శ్రీరామ ఉయ్యాలో..

# పూల పండుగొచ్చె

## నేటి నుంచి బతుకమ్మ సంబురాలు

- ఆడపడుచులకు ఇష్టమైన పండుగ
- ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- పల్లెల్లో విద్యుత్ దీపాలు..
- చెరువు కట్టల వద్ద ముస్తాబు
- బతుకమ్మ పువ్వుల్లో ఔషధ గుణాలు

తొమ్మిది రోజులు, తొమ్మిది రూపాల్లో బతుకమ్మ

మొదటి రోజు.. ఎంగిలిపువ్వు బతుకమ్మ
రెండో రోజు.. అటుకుల బతుకమ్మ
మూడో రోజు.. ముద్ద పప్పు బతుకమ్మ
నాలుగో రోజు.. బియ్యం బతుకమ్మ
ఐదో రోజు.. అట్ల బతుకమ్మ
ఆరో రోజు.. అలిగిన బతుకమ్మ
7ఏడో రోజు.. వేపకాయ బతుకమ్మ
ఎనిమిదో రోజు.. వెన్నముద్దల బతుకమ్మ
తొమ్మిదో రోజు.. సద్దుల బతుకమ్మ

2లో

తెలంగాణ ఆడబిడ్డల అతిపెద్ద వేడుక బతుకమ్మకు వేళ అయ్యింది. ఆదివారం ఎంగిలిపువ్వుతో తొమ్మిది రోజుల పూల సంబురం ప్రారంభం కానున్నది. ఇక రోజూ ఊరూవాడ ఉయ్యాల పాటలు హోరెత్తనున్నాయి. తీరొక్క పూలను తెచ్చి, పేర్చి ఆడబిడ్డలు సంతోషంగా బతుకమ్మ ఆడనున్నారు. భాద్రపద బహుళ పంచమి మొదలుకుని మహాలయ అమావాస్య (పితృ అమావాస్య) వరకు ఆడబిడ్డలు బొడ్డెమ్మలు ఆడతారు. అనంతరం బతుకమ్మ పండుగ మొదలవుతుంది. పితృ అమావాస్య నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమై సద్దుల బతుకమ్మతో సంపూర్ణం అవుతాయి. ఈ 9 రోజులు భక్తి శ్రద్ధలతో 9 రకాలుగా బతుకమ్మలను పేర్చి నైవేద్యాలను సమర్పిస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు నీటి వనరుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దీపాలు, బారికేడ్లు, తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది చెరువుల నిండా నీళ్లు ఉన్నందున జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. కాగా, ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ చీరెల పంపిణీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతున్నది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు.

*– డీడీ 9 వార్త, భద్రాచలం*





సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న

## క్రికెటర్ దిగ్గజం వి.వి.ఎస్. లక్ష్మణ్

- సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం
- ప్రత్యేక అర్చనలు, పూజలు..

3లో





మావోయిస్టు కరపత్రాల

## కలకలం

- భయాందోళనలో స్థానికులు
- మావోయిస్టు కేంద్ర కమిటీ పేరుతో కరపత్రాలు
- పార్టీ స్థాపన వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపు

3లో



ప్రభుత్వ లక్ష్యాల సాధనకు

## బ్యాంకర్లు సహకరించాలి

- అవసరమైన రుణాలు అందించాలి
- రూ.2291 కోట్ల పంటరుణ లక్ష్యం
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

4లో

# పూల పండుగొచ్చె

- నేటి నుంచి బతుకమ్మ సంబురాలు
- తెలంగాణ సంస్కృతికి ప్రతీక
- తొమ్మిది రోజులు, తొమ్మిది రూపాల్లో బతుకమ్మ
- ఆడపడుచులకు ఇష్టమైన పండుగ
- ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- పల్లెల్లో విద్యుత్ దీపాలు.. చెరువు కట్టల వద్ద ముస్తాబు
- బతుకమ్మ పువ్వుల్లో ఔషధ గుణాలు

**నేడు ఎంగిలి పూల బతుకమ్మ**

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాలో..
ఒక్కేసి పువ్వేసి చందమామ..
ఒక్క జామాయె చందమామ..
రామ.. రామ.. ఉయ్యాలో..
రామనే శ్రీరామ ఉయ్యాలో..



తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీక. ఇది ఆడపడుచుల పండుగ, సాయంత్రం అయ్యేసరికి, పట్టు చీరలు, మెడలో నగలతో ముస్తాబై పూలతో పేర్చిన బతుకమ్మను ప్రధాన కూడళ్లలో విశాలమైన ప్రదేశం లో పెట్టి సద్దుల బతుకమ్మ వరకు సాయంత్రం వేళ గాజుల గలగల వాయిద్యాలుగా మలచి, పల్లవికి శృతి కలుపుతూ లయబద్ధంగా అడుగులు వేస్తూ.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. కలవారి కోడలు ఉయ్యాలో.. కలికి కామాక్షి ఉయ్యాలో.. అంటూ బతుకమ్మ ఆడు తూ పాటలు లయబద్ధంగా పాడుతూ ఉంటారు. పూలతో పూజించే దేవత అమ్మ.. పూలనే దేవతగా పూజిస్తే బతుకమ్మ..బతుకమ్మ బతుకును కొలిచే పండుగ. బతుకునిచ్చే తల్లిని శక్తిరూపంగా భావిస్తూ, లక్ష్మీ, గౌరీదేవీలను ఆటపాటల ద్వారా పూజిస్తూ, రకరకాల వంటలు నైవేద్యంగా సమర్పిస్తూ, మనకున్నంతలో కొత్తబట్టలు, నగలు ధరిస్తూ ఆడబిడ్డలను పండుగకు ఆహ్వానిస్తూ జరుపుకొనే గొప్ప వేడుక బతుకమ్మ. మనకే ప్రత్యేకం ఈ పండుగ. పూల జాతరకు పల్లె, పట్టణాలు ముస్తాబయ్యాయి. పెత్రమాస రోజు నుంచి తొమ్మిది రోజుల వరకు బతుకమ్మను పేర్చి ఆడుతారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు నీటి వనరుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దీపాలు, బారికేడ్లు, తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది చెరువుల నిండా నీళ్లు ఉన్నందున జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. కాగా, ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ చీరెల పంపిణీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతున్నది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. - డీడీ9 వార్త, భద్రాచలం

## బతుకమ్మ రూపం ఇలా..

వెదురు ఈనెలతో చేసిన సిబ్బినిలోగానీ.. ప్లేట్లు లేదా తంబాలంలో గానీ, బతుకమ్మను పేరుస్తారు. కింద గుమ్మడి లేదా బీర ఆకులను పరిచిన అనంతరం తంగేడు పూలను పేరుస్తారు. అనంతరం గును గు, గడ్డి, చామంతి తదితర తీరొక్క పూలతో శంకు ఆకారంలో పేరుస్తుంటారు. ఇలా పేర్చిన బతుకమ్మను పూజగది ముందు ఉంచుతా రు. సాయంత్రం వేళలో గ్రామచావిడీలు, గల్లీల వద్ద పెట్టి మహిళలు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతుంటారు. ఇలా ఆడిన తర్వాత బతుకమ్మను తీసుకుని చెరువు గట్టు వద్దకు పాటలు పాడుతూ వెళ్లి, మళ్లీ చెరువు గట్టు దగ్గర ఆడుతుంటారు. ఆడిన అనంతరం నిమజ్జనం చేస్తారు.





ఎంగిలి పూలరోజు, సద్దుల బతుకమ్మ రోజు తయారు చేసిన గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. సద్దుల బతుకమ్మ పండుగ రోజున బతుకమ్మ ఆడే ప్రధాన కూడలి వద్ద వెంపల్లి చెట్టు కొమ్మను నాటి పసుపు, కుంకుమలు చల్లుతారు. బతుకమ్మ మొదటి రోజు ఎంగిలిపూలు అంటారు. పెత్తరమాస రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిది రోజులు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ఈ రోజుల్లో రోజొక్క తీరు ఫలహారాలను తీసుకెళ్లి బతుకమ్మ చెరువులో నిమజ్జనం చేసిన అనంతరం ఫలహారాలను స్వీకరిస్తారు.

### తొమ్మిది రూపాల్లో బతుకమ్మ

బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రూపాలతో కొలుచుకోవడం తెలంగాణ ప్రజల ఆనవాయితీ.

### 1. ఎంగిలిపూల బతుకమ్మ

బతుకమ్మ నవరాత్రుల్లో మొదటి రోజున ఎంగిలి పూల బతుకమ్మ అంటారు. బతుకమ్మను పేర్చడానికి వాడే పూలు ఒకరోజు ముందే తెంపుకొచ్చి అవి వాడిపోకుండా నీళ్లలో వేసి మర్నాడు బతుకమ్మగా పేరుస్తారు. మొదటి రోజును ఎంగిలిపూల బతుకమ్మ అంటారు.

### 2. అటుకుల బతుకమ్మ

రెండో రోజు ఉదయాన్నే అడవికి వెళ్లి తంగేడు, గునుగు, బంతి, చామంతి, అడవి గడ్డిపూలు తీసుకువస్తారు. ఈ పూలను రెండు ఎత్తులతో గౌరమ్మను పేర్చి ఆడవారందరు కలిసి ఆడుకొని సాయంత్రం చెరువులో వేస్తారు. అటుకులు వాయినంగా పెడుతారు.

### 3. ముద్దపప్పు బతుకమ్మ

మూడోరోజు బతుకమ్మను మూడంతరాల్లో చామంతి, మందారం తదితర పూలతో బతుకమ్మను అలంకరిస్తారు. వాయినంగా సత్తుపిండి, పెసర్లు, చక్కెర, బెల్లం కలిపి పెడతారు.

### 4. నాన బియ్యం బతుకమ్మ

నాలుగో రోజు నానబియ్యంగా పలహారం పెడుతారు. ఈ రోజు తంగేడు, గునుగు పూలతో నాలుగు అంతరాల బతుకమ్మను పేర్చుతారు. నానబోసిన బియ్యాన్ని బెల్లంతో కానీ, చక్కెరతో కానీ కలిపి ముద్దలు చేసి పెడుతారు.

### 5. అట్ల బతుకమ్మ

ఐదో రోజు తంగేడు, గునుగు, చామంతి తదితర పూలతో ఐదంతరాలుగా బతుకమ్మను పేర్చుతారు. వాయినంగా పిండితో చేసిన అట్లను పెడుతారు.

### 6. అలిగిన బతుకమ్మ

ఆదో రోజు ఎలాంటి పూలతో బతుకమ్మను పేర్వరు. పూర్వకాలంలో బతుకమ్మ పేర్చే సమయంలో మాంసం ముద్ద తగలడంతో అపచారం జరిగిందని ఆరో రోజు బతుకమ్మను ఆడరు.

### 7. వేపకాయల బతుకమ్మ

వివిధ పూలతో ఏడో రోజు బతుకమ్మను ఏడంతరాలుగా పేర్చుతారు. వాయినంగా సకినాల పిండిని వేపకాయల్లా చేసి పెడుతారు లేదా పప్పుబెల్లం నైవేద్యంగా పెడుతారు.

### 8. వెన్నెముద్దల బతుకమ్మ

ఎనిమిదో రోజు వివిధ రకాల పూలతో ఎనిమిది అంతరాలుగా బతుకమ్మను పేర్చి ఆడుతారు. ఈ రోజు వాయినంగా నువ్వులు, బెల్లం కలిపి ప్రసాదంగా పెడతారు.

### 9. సద్దుల బతుకమ్మ

పండుగ చివరి రోజు సద్దుల బతుకమ్మగా పిలుస్తారు. ఎన్ని రకాల పూలు దొరికితే అన్ని రకాలతో బతుకమ్మను పెద్దగా పేరుస్తారు. చిన్న బతుకమ్మ పేర్చి గౌరమ్మను పెడతారు. సద్దులు తీసుకెళ్లి చెరువు గట్టు వద్ద బతుకమ్మ ఆడిన అనంతరం వాయినాలు ఇచ్చుకొని సద్దులను కుటుంబీకులతో కలిసి భుజిస్తారు.

# కలకలం రేపిన మావోయిస్టు కరపత్రాలు



**వెంకటాపురం సెప్టెంబర్ 20 (డీడీ9 న్యూస్ (నూగూరు):**

మావోయిస్టు కరపత్రాలు వెల్లడి మళ్లీ కలకలం రేపాయి. ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన పాత్రాపురం గ్రామ శివారులో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంబడి మావోయిస్టు కేంద్ర కమిటీ పేరుతో ముద్రించిన కరపత్రాలు కనిపించగా, పార్టీ స్థాపన వార్షికోత్సవాలను ఈ నెల 21 నుంచి 27 వరకు విజయవంతం చేయాలని వాటిలో పిలుపునిచ్చారు. “ఐక్య సంఘటన విప్లవ ఉద్యమాన్ని కాపాడుకుందాం, పార్టీని శత్రు అభేద్యంగా తీర్చిదిద్దుదాం” అని

ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కరపత్రాలు వెలువడటంతో వెంటనే ప్రజల్లో ఆసక్తి, ఆందోళనల మేళవింపు కనిపించింది. భూస్వామ్య పెత్తందారులకు హెచ్చరికలు ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో గురువారం రాత్రి మావోయిస్టు పార్టీ భద్రాద్రికొత్తగూడెంఅల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ పేరుతో మరో లేఖ విడుదల చేశారు. భూస్వాములపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ “ఖబద్దార్... పద్ధతి మార్చుకోండి. లేకపోతే మీ ఆగడాలను కూకటి వేళ్లతో పెకిలిస్తాం” అని బహిరంగ హెచ్చరిక చేశారు. లేఖలో చర్ల మండలంలోని కొంతమంది ప్రముఖుల పేర్లను ప్రస్తావిస్తూ, వారు మావోయిస్టు పార్టీపై చేస్తున్న ప్రచారాన్ని తక్షణం నిలిపేయాలని డిమాండ్ చేశారు. “పెద్దరికం మానండి, పేదల భూములను పంచండి. లేదంటే భూములను పార్టీ స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతుంది” అని హెచ్చరించారు. అంతేకాకుండా అడవి సంపదను దోచుకెళ్తున్నారనే ఆరోపణలు చేసి, తమపై జరుగుతున్న కుట్రలకు తగిన సమాధానం ఇస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ అమరుల స్ఫూర్తిలేఖలో ఆపరేషన్ ‘కగార్’లో ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాల స్ఫూర్తితో పోరాటం కొనసాగిస్తామని మావోయిస్టులు స్పష్టం చేశారు. ఈ కరపత్రాల వెలుగులోకి రావడం వల్ల ములుగు, భద్రాద్రి జిల్లాల్లో గణనీయమైన ప్రకంపనలు సృష్టించాయి.



# మా సమస్యలు పరిష్కరించండి..

**అశ్వాపురం, సెప్టెంబర్ 20 (డిడి 9 వార్త):**

స్థానిక తుమ్మల చెరువు పంచాయతీలో వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ పంచాయతీ కార్యదర్శి గారికి విన్నపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. వెంకటేశ్వర్లు, బుర్ర భద్రయ్య, సోడా వెంకట బాబు, ఎస్కే హుస్సేన్‌తో పాటు వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు. ఇక వెంకటాపురం గ్రామపంచాయతీలోనూ ఇదే తరహా కార్యక్రమం జరిగింది. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు కలిసి పంచాయతీ కార్యదర్శికి తమ సమస్యల పరిష్కారం కోసం విన్నపత్రం అందజేశారు. ఈ సమావేశంలో ఎస్కే హుస్సేన్, సోడే వెంకన్న బాబు, సిహెచ్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.







# గిరిజనుల అభివృద్ధి ఆదర్శనీయం

- **గిరిజనులకు విద్య , వైద్యం , యువతకు స్వయం ఉపాధి , సంక్షేమ పథకాల అభివృద్ధిలో ఐటిడిఎ పిఓ**
- **బి రాహుల్ ఐఏఎస్ కృషి అభినందనీయం - విశ్రాంత ఐఏఎస్ సుబ్బారావు**

**భద్రాచలం, సెప్టెంబర్ 20 (డి.డి9 వార్త):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనులు తమ సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడుకుంటూ అభివృద్ధి దిశగా ముందడుగులు వేస్తుండటం ఎంతో ఆనందకరమని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.వి. సుబ్బారావు అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో గిరిజనులకు అందిస్తున్న వివిధ సంక్షేమ, స్వయం ఉపాధి పథకాలను పరిశీలించడంతో పాటు ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించారు.


ఈ కార్యక్రమంలో ఆయనతో ఐటిడిఏ పీవో బి. రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గిరిజనులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను సాధించే మార్గాలను సూచించడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, వారు ఆర్థికంగా ముందడుగు వేయడానికి ఇది తోడ్పడుతుందని అన్నారు. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను కొత్త తరానికి పరిచయం చేసే విధంగా మ్యూజియం రూపకల్పన చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాత తరపు ఆభరణాలు, వస్తువులు, పెయింటింగ్స్ ద్వారా గిరిజనుల జీవన విధానాన్ని ప్రతిబింబించడం విశేషమని, ముఖ్యంగా ప్రతి కళాఖండం వివరాలను తెలుగులో పొందుపరచడం ఒక చక్కటి ప్రయత్నమని ఆయన కొనియాడారు. అదనంగా, ఐటిడిఏ ద్వారా మారుమూల ప్రాంత గిరిజన కుటుంబాలకు అర్హులైన ప్రతివారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. పై చదువులు కొనసాగిస్తున్న గిరిజన విద్యార్థులకు ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా ల్యాప్‌టాప్‌లను కూడా అందజేస్తున్నామని వివరించారు. తరువాత సుబ్బారావు దంపతులకు ట్రైబల్ మ్యూజియం తరఫున సన్మానం చేశారు. అదే సమయంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ కాంతారావు గిరిజన గ్రామాల్లో రెడ్ క్రాస్ చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ మేనేజర్ ఆదినారాయణ, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, రెడ్ క్రాస్ కార్యదర్శి రాజు, మ్యూజియం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న వి.వి.ఎస్. లక్ష్మణ్

**భద్రాచలం, సెప్టెంబర్ 20 (డిడి9 వార్త):**

భారత క్రికెట్ జట్టు మాజీ దిగ్గజం, జాతీయ క్రికెట్ అకాడమీ (NCA) అధిపతి అయిన వి.వి.ఎస్. లక్ష్మణ్ శనివారం తన కుటుంబంతోకలిసిభద్రాచలంలోనిప్రముఖ శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న లక్ష్మణ్ కుటుంబానికి ఆలయ అధికారులు మంగళ వాయిద్యాలు, పూలమాలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం, లక్ష్మణ్ దంపతులు ప్రధాన ఆలయంలో కొలువై ఉన్న సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి వారి ఎదుట ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఉపాలయంలో అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని వి.వి.ఎస్. లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి దామోదరరావు శాలువాతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. లక్ష్మణ్ పర్యటన నేపథ్యంలో ఆలయంలో కొంతసేపు సందడి వాతావరణం నెలకొంది.








# బతుకమ్మ సంబరాలు

- **కోలాహలంగా బతుకమ్మ సంబరాలు**
- **ఆనందోత్సాహాలతో జరుపుకున్న చిన్నారులు**

**చర్ల, సెప్టెంబర్ 20 ( డిడి 9 వార్త)**

చర్ల లో రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం నందు దసరా పండుగ సందర్భంగా ముందుగానే బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలు చేసి చిన్నారులు ఈ వేడుకలలో ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ పాటలకు కోలాటం ఆడుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తో పాటు వారి తల్లిదండ్రులు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు జి.వర్మ రాజు, ఉప ప్రధానోపాధ్యాయుడు ఎమ్.వీ. ఎల్. నరసింహారావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మాధురి,మౌనిక,లావణ్య, శిరీష,సుప్రియ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.





# ప్రభుత్వ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం, సెప్టెంబర్ 20 (డిడి 9 వార్త):**




ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో భాగంగా రైతులు, స్వయం సహాయక సంఘాలు, పీఎం స్వానిధి లబ్ధిదారులు, ఎఫ్‌పి.ఒ సంస్థల అభివృద్ధి కోసం అవసరమైన రుణాలు సకాలంలో అందించి బ్యాంకులు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు.శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన డి.సి.సి, డి.ఎల్.ఆర్.సి సమీక్షా సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రీణాల్ శ్రేష్టాతో కలసి బ్యాంకర్లతో కలెక్టర్ మాట్లాడారు. రైతులకు రుణాల పంపిణీ, స్వశక్తి సంఘాల రుణ రికవరీ, పీఎం స్వానిధి రుణాలు, ఎఫ్‌పి.ఒల ఏర్పాటు వంటి అంశాలను సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2291 కోట్ల పంటరుణ లక్ష్యంలో ఇప్పటివరకు రూ.409.55 కోట్లు, రూ.1416.09 కోట్ల వ్యవసాయ టర్మ్ రుణ లక్ష్యంలో రూ.342.31 కోట్ల రుణాలు మంజూరైనట్లు వివరించారు. బ్యాంకుల వారీగా పనితీరును సమీక్షించిన కలెక్టర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఎస్బిఐలు తక్కువ రుణాలు మంజూరు చేసిన కారణాలను ఆరా తీశారు.స్వయం సహాయక సంఘాలకు చేపల పెంపకం యూనిట్లు, కౌజు పిట్టల పెంపకం యూనిట్ల స్థాపనకు మూడునెలల్లో 500 యూనిట్లు ఏర్పాటు చేయాలంటూ ఆయన బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశిత లక్ష్యాలను విస్మరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న రుణాల ప్రతిపాదనలను తక్షణమే మంజూరు చేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకర్లకు సమూహాల వివరాలు గ్రామీణ అభివృద్ధి అధికారి వెంటనే అందజేయాలని, పట్టణాల్లో మెప్మా బృందాల వివరాలు బ్యాంకులకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు చేపట్టే అభివృద్ధి యూనిట్లకు రుణ సదుపాయం కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలంటూ బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విద్యాచందన, ఎల్‌డిఎం రామ్ రెడ్డి, మెప్మా పీడీ రాజేష్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# యాంటీ బుక్స్ - ఎవైడ్ డ్రగ్స్

- **భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ శివనాయక్**

**చర్ల, సెప్టెంబర్ 20 (డిడి 9 వార్త)**

చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ యందు, చర్ల మండల యూత్ సహకారంతో మాదకద్రవ్యాల వల్ల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కలిగించడం కోసం సమాజం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం అనే అంశంపై మండలంలోని ఎనిమిది నుంచి పది తరగతుల విద్యార్థిని విద్యార్థులకు మరియు ఇంటర్మీడియట్ విద్యార్థినీ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.శివ నాయక్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు యువత మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్ ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. చర్ల మండలం ఛత్తీస్ ఘడ్ రాష్ట్రానికి సరిహద్దున ఉన్నందున పిల్లలు డ్రగ్స్ కు అలవాటు పడి వారి జీవితం నాశనం చేసుకుంటున్నారని అన్నారు. పిల్లలు మాదకద్రవ్యాల మత్తుకు చిత్తవుతూ కన్నవారి కలల సౌదాలను కొల్లగొడుతున్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా జీవిత లక్ష్యం వైపు పయనించి బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవడానికి ఈ అవగాహనా సదస్సు ఎంతగానో తోడ్పడుతుందని ఆయన అన్నారు. సే నో డ్రగ్స్ అంటూ బంగారు భవిష్యత్తుకు సోపానాలు నిర్మించుకోండి అని యువతకు పిలుపునిచ్చారు.



**మొబైల్ వద్దు... పుస్తకాలు ముద్దు..**

యువత నేడు సోషల్ మీడియా కి ఆకర్షితులై నిండు నూరేళ్ల జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని సీఐ రాజు వర్మ అన్నారు. మొబైల్ ను వదిలి పుస్తకాల చేత పట్టి ఈ వయసులో ఏదైతే మంచి నిర్ణయం తీసుకుంటారో అదే మీ జీవితాన్ని నిలబెడుతుందని అన్నారు. విద్యార్థుల జీవితాలను నిర్ణయించేది ఇద్దరు ఒకరు తల్లిదండ్రులు మరొకరు ఉపాధ్యాయులు. తల్లిదండ్రులు కానీ ఉపాధ్యాయులు గాని విద్యార్థుల తప్పులను సరిదిద్ది సన్మార్గంలో పెట్టినట్లయితే ఆ విద్యార్థి జీవితంలో ఒక మంచి స్థానం లో ఉండి ఆ ఉపాధ్యాయుడిని జీవితాంతం గుర్తుపెట్టుకుంటాడు. డబ్బు ఎప్పుడైనా సంపాదించవచ్చు కానీ సమయం మాత్రం పోతే మళ్ళీ సంపాదించుకోలేము. కాబట్టి యువత చెడు వ్యసనాల వైపు మల్ల కుండా మంచిగా చదువుకొని ఉన్నతమైన స్థానాలను చేరుకొని మీ భవిష్యత్తును బంగారుమయం చేసుకొవాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు అంబేద్కర్, అవులూరి సత్యనారాయణ, సాధన పల్లి సతీష్, భాష్యం శారద, దాట్ల సంధ్య, యలమందల జగదీష్, చల్లా శివ కృష్ణ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నరేంద్ర, డాక్టర్లు దివ్య నైనా, రామకృష్ణ, నగేష్, మండల విద్యాశాఖ అధికారి పరిటాల వెంకట రమణ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవులు, చర్ల మండల యూత్ సభ్యులు నరసింహారెడ్డి, పరిటాల సంతోష్ కుమార్, కొట్టే నవీన్, బొబ్బిలిపాటి రవి కిరణ్, కిషోర్, రామలక్ష్మణ్, విద్యార్థులు, ఐశ్వర్య మహిళా శక్తి అసోసియేషన్, తేగడ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.









# వెంకటాపురంలో బతుకమ్మ సంబురాలు

- **పూల శోభతో విద్యా సంస్థలు కళకళ**

**వెంకటాపురం (నూగురు) సెప్టెంబర్ 20 ( డిడి 9 వార్త )**

వెంకటాపురం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు శనివారం అంబరాన్నంటాయి. ఈ నెల 21వ తేదీ నుండి దసరా సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందుగానే కలిసి ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు.

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, రంగరాజపురం పాఠశాల, భారతి విద్యానికేతన్, విజన్ పబ్లిక్ స్కూల్ వంటి అన్ని విద్యా సంస్థలలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు రంగురంగుల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చారు. వాటిని పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన గద్దెల వద్దకు తీసుకువచ్చి, బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ వలయాకారంలో నృత్యాలు చేశారు. వారి ఉత్సాహం, సంప్రదాయబద్ధమైన వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల ద్వారా విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంచడం జరిగిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# ఆటో – బైక్ ఢీ

- **ఒక్కరికి తీవ్ర గాయాలు**

**వెంకటాపురం ( నూగురు) సెప్టెంబర్ 20 (డీడీ9 వార్త):**

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని శివాలయం మూల మలుపు వద్ద శనివారం సాయంత్రం రోడ్డుప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం ఎదురెదురుగా వచ్చిన ఆటో, మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఉప్పెడు గొల్ల గూడెం గ్రామానికి చెందిన నూకల సూరయ్య తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిని వెంటనే వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే స్పందించిన స్థానికులు ఆయనను ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అవసరమైన చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం అనంతరం ఆటో డ్రైవర్ వాహనం తో సహా పరారైనట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.







# శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్ దంపతులు

**భద్రాచలం సెప్టెంబర్ 20 (డిడి 9 వార్త)**

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్ దంపతులు శనివారం భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు ఆలయ అధికారులు సంప్రదాయ పద్ధతిలో మంగళ వాయిద్యాలు, పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

అనంతరం వారు ప్రధాన ఆలయంలోని సీతా, లక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి అర్చన చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఉపాలయంలో పూజారి వేద మంత్రాలతో వారికి వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి దామోదరరావు న్యాయమూర్తి దంపతులను శాలువాతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.వీరితో పాటు భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివ నాయక్ పాల్గొన్నారు.



# 28న ధర్మయుద్ధ మహాసభ

- **ధర్మ యుద్ధ మహాసభలో ఆదివాసీలు పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో పాల్గొని గర్జించాలని కోరారు.**
- **లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల పిలుపు**

**భద్రాచలం, సెప్టెంబర్ 20 (డిడి 9 వార్త):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఈ నెల 28న జరగబోయే చలో భద్రాచలం ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాలు బహిరంగ పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో శనివారం స్థానికంగా నిర్వహించిన సనాక సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల ఆదివాసీ సంఘ నాయకులు, జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.సమావేశంలో లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలనే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. "ఒకే మాట, ఒకే నినాదం"తో ముందుకు కదిలి తమ హక్కుల కోసం పోరాడాలని ఆదివాసీ జేఏసీ నిర్ణయించింది.జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ చూరన్న రామకృష్ణ మాట్లాడుతూ, "ఆదివాసుల విద్య, ఉద్యోగం, భూములు, సంస్కృతులన్నిటిపైనా లంబాడీల వలన తీవ్ర నష్టం జరిగింది. లంబాడీలు కేవలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఎస్టీలుగా గుర్తింపు పొందారు. మిగతా రాష్ట్రాల్లో మాత్రం వారు బీసీ, ఎస్సీ, ఓబీసీలుగా వర్గీకరించబడ్డారు. కాబట్టి వారిని ఎస్టీ జాబితా నుండి తప్పించడం తప్పనిసరి" అని స్పష్టం చేశారు.భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకటరావు, మాజీ ఎంపీ సోయం బాబూరావు ముందుగా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసును గుర్తుచేస్తూ, ప్రజా పోరాటం, రాజకీయ, న్యాయ, సంస్కృతి పరిరక్షణ పోరాటాలన్నీ సమాంతరంగా నడుస్తాయని నేతలు తెలిపారు.ఈ సందర్భంగా నేతలు వాల్ పోస్టర్లు, పాంప్లెట్లు ఆవిష్కరించి మహాసభ విజయవంతం చేయాలంటూ ప్రజలను పిలుపునిచ్చారు. సమావేశంలో ఆదివాసి జేఏసీ నేతలు వీరభద్రం, పోనేం కృష్ణ, కుంజ శీను, పోడియం నరేందర్, ఇర్పా అనసూయ, గనిబోయిన శీను తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఉచిత నోటుబుక్స్, బ్యాగుల పంపిణీ

**అశ్వాపురం, సెప్టెంబర్ 20 (డిడి9):**

అశ్వాపురం మండలం వెంకటాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉచిత నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ సుబ్రహ్మణ్య ఆగ్రో ఏజెన్సీస్ ఆధ్వర్యంలో మరియు స్పీక్ కంపెనీ సహకారంతో డాక్టర్ సోమా నితీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించారు.

ఈ సందర్భంలో 80 మంది విద్యార్థులు నోటుబుక్స్, బ్యాగులు అందుకున్నారు. శ్రీ సుబ్రహ్మణ్య ఆగ్రో ఏజెన్సీస్ యజమాని సోమ వెంకటరెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి. చదువుతోనే పేదరికాన్ని అధిగమించవచ్చని" అన్నారు.

కార్యక్రమంలో స్పీక్ కంపెనీ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, కూసుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, మడకం శరత్, నరేష్, అలాగే పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## ములుగు జిల్లా టాస్ ఉల్లాస్ కోఆర్డినేటర్ గా ఎంపికైన పీర్ల..

**సెప్టెంబర్ 20. డిడి 9 వార్త వెంకటా-పురం.(నూగురు)**

వెంకటాపురం మండల పరిధిలో ని సుడిబాక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ములుగు జిల్లా టాస్ ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ గా ఎంపికైన పీర్ల కృష్ణ బాబును శనివారం లక్ష్మీనగరం కాంప్లెక్స్ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో , ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉద్యోగం సాధించి ఈరోజు జిల్లా స్థాయి పదవికి ఎంపికైనందుకు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో ని వయోజన విద్యను బలోపేతం చేసి సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చి దిద్దాలని ఈ సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమౌళి, బొగ్గుల లక్ష్మయ్య ,గోవర్ధన్ బుచ్చయ్య ,బాబురావు నరసింహ చారి ,సరిత సమ్మయ్య, కుమారస్వామి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మరణించిన కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం

**భద్రాచలం సెప్టెంబర్ 20 ( డిడి 9 వార్త ):**

భద్రాచలం నియోజకవర్గానికి చెందిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, దుమ్ముగూడెం మండలం, చిన్న బండి రేవు గ్రామం మరియు సీతారాంపురం ప్రాంతాల్లో ఇటీవల అనారోగ్య కారణంగా మరణించిన కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే గారు కుటుంబ సభ్యులకు మానసిక ధైర్యం ఇచ్చారు, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, స్థానిక కార్యకర్తలు, మాజీ ప్రతినిధులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ, "ప్రతి కుటుంబం మన సమాజంలో ప్రత్యేకమైనది. ఇలాంటి కష్టసమయాల్లో వారి తోడుగా ఉండటం మన బాధ్యత" అని పేర్కొన్నారు



# బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ అత్యవసరం

- **ఐటీడీఏ పీఓ బి. రాహుల్**

**భద్రాచలం సెప్టెంబర్ 20 ( డిడి 9 వార్త )**

బాలికలు తమతోపాటు తమ తోటి వారిని కూడా రక్షించుకునేలా మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణలు ఉపయోగ పడతాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. భవిష్యత్తులో, కష్ట సమయాల్లో ఇటువంటి శిక్షణలు వారికి ఎంతోగానో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. శనివారం భద్రాచలంలోని డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పీఓ రాహుల్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆత్మరక్షణ శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా పీఓ రాహుల్ మాట్లాడుతూ, సమాజంలో బాలికలు, మహిళలు ధైర్యంగా ముందుకు వెళ్ళడానికి మార్షల్ ఆర్ట్స్, కరాటే, సెల్ఫ్ డిఫెన్స్ వంటి శిక్షణలు ఎంతో అవసరమన్నారు. 15 రోజుల పాటు శిక్షణ పొందిన బాలికలు ఈ మెళకువలను ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. అయితే, విపత్కర పరిస్థితుల్లో మాత్రమే ఈ విద్యను ఉపయోగించుకోవాలని, ఇష్టానుసారంగా ఎవరిపైనా ప్రవర్తించకూడదని హెచ్చరించారు. ఆత్మరక్షణ విద్యలు బాలికలకు ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపి ముందడుగు వేయడానికి శక్తిని స్తాయని ఆయన అన్నారు.



అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ మాట్లాడుతూ, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 16 వరకు 15 రోజుల పాటు కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణను అందించామని తెలిపారు. షేక్ హర్షద్ ఈ కార్యక్రమానికి శిక్షకుడిగా వ్యవహరించారని పేర్కొన్నారు. బాలికలు ఎంతో శ్రద్ధతో ఈ శిక్షణలో పాల్గొని ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంచుకున్నారని, మహిళల భద్రతపై మరింత అవగాహన సాధించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హవేల, అకడమిక్ కోఆర్డినేటర్ హిమజ, రఘు సుమా, కపిల భారతి, సమీరా, శ్రీలత, పర్యవేక్షకులు రేవతి, పూర్ణిమ, కల్పన, శరణ్య, పావని, భవానిలతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# పినపాకలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ!

- **తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ బీసీ నేత బొడ్డు ఏసుబాబు రాజీనామా**
- **బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న పార్టీలో చేరిక**

**పినపాక సెప్టెంబర్ 29 ( డిడి 9 వార్త )**

మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నేతగా గుర్తింపు పొందిన భద్రాద్రి జిల్లా సీనియర్ బీసీ నాయకులు బొడ్డు ఏసుబాబు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆయన శనివారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) ఏర్పాటు సమావేశంలో ఆయన పాల్గొన్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా స్థాపించిన ఈ కొత్త పార్టీలో తాను భాగస్వామి కానున్నట్లు ప్రకటించారు.

పినపాక నియోజకవర్గం, పినపాక మండలంలో బీసీ సంక్షేమ సంఘం, మున్నూరు కాపు నాయకుడిగా ఏసుబాబుకు బలమైన పట్టు ఉంది. త్వరలో మరికొందరు బీసీ నాయకులతో కలిసి తీన్మార్ మల్లన్న సమక్షంలో టీఆర్‌పీలో చేరనున్నారు.

**బీసీలకు కాంగ్రెస్ పార్టీలో అన్యాయం**

2023 ఎన్నికల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గెలుపు కోసం బొడ్డు ఏసుబాబు విశేషంగా కృషి చేశారు. బీసీ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి పాయం విజయంలో కీలక పాత్ర పోషించారు. అయితే, ఇంత కృషి చేసినా బీసీ నాయకులకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా బీసీలకు న్యాయం జరగదని భావించి పార్టీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు.

**టీఆర్‌పీలో ఏసుబాబుకు కీలక స్థానం**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు మల్లన్న, బొడ్డు ఏసుబాబుకు పార్టీలో మంచి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రజల్లో బీసీ రాజ్యాధికారం ఆవశ్యకతను విస్తృతంగా తెలియజేయాలని ఆయనకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పినపాక మండలంలోని వివిధ పార్టీల బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులతో ఆయన చర్చలు జరుపుతున్నారు. రాబోయే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ తమ సత్తా చాటుతుందని ఏసుబాబు ధీమా వ్యక్తం చేశారు. తన రాజీనామా లేఖను పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, భద్రాద్రి జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపనున్నట్లు తెలిపారు.



# SNSPA ఆధ్వర్యంలో వైద్య శిబిరం విజయవంతం

**వాజేడు, సెప్టెంబర్ 20(డిడి9 వార్త):**

పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు ఈ ఉచిత మెగా వైద్య శిబిరం కొనసాగనుంది.డా. అరవింద (స్త్రీ వైద్య నిపుణురాలు), డా. యోషిత, డా. రాహిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఇప్పటివరకు 312 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు.

ఈ శిబిరంలో అసంక్రమిత వ్యాధులు,క్షయ వ్యాధి,మానసిక రుగ్మతలు,సికిల్ సెల్ వ్యాధి,దంత సమస్యలు వంటి ఎనిమిది జాతీయ కార్యక్రమాల పరిధిలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన చికిత్సలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో HEO వేణుగోపాలకృష్ణ, PHN సంగీత, నర్సింగ్ ఆఫీసర్, ANMs అనూష రమ, రమాదేవి, శ్రీదేవి, శకుంతల, శారద, సుమలత, రాజ్యలక్ష్మి, HA తిరుపతి, శ్రీను, జయంత్ లాల్, DEO నవీన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# ఎస్.డి. జియావుద్దీన్ సంస్మరణ సభ

**భద్రాచలం, సెప్టెంబర్ 20 (డీడీ9 వార్త):**

భద్రాచలంలోని పాత ఎల్ఐసి ఆఫీస్ ఎదురుగా ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కార్యాలయంలో ఆదర్శ ఉపాధ్యాయ నేత, అమరజీవి ఎస్.డి. జియావుద్దీన్ గారి సంస్మరణ సభ శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముందుగా జియావుద్దీన్ గారి చిత్రపటానికి బంధు వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారు మాదిరెడ్డి రామ్మోహనరావు, కోశాధికారి డి.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు చంద్ర సుబ్బయ్య చౌదరి, ఎస్.రాజబాబు, టి.శివప్రసాద్, టెలికాం డిపార్ట్మెంట్ ఆల్ పెన్షనర్స్ నేత విష్ణు, మొలకల సుబ్రహ్మణ్యం, ఐటీసీ భద్రాచలం నేత అజయ్ కుమార్ తదితరులు పూల దండలు సమర్పించి నివాళులర్పించారు. తరువాత జరిగిన సభలో మాట్లాడుతూ అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు, "భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం, ఉపాధ్యాయ వర్గం సమస్యల పరిష్కారానికి జియావుద్దీన్ గారు పోరాటాలు నిర్వహించారు. కొత్తూరు నారాయణపురంలో ఆశ్రమ పాఠశాలలో పనిచేసిన రోజులలో గిరిజన విద్యార్థులకు ఆట స్థలం లేకపోవడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులను చందా సేకరించమని ప్రేరేపించి, తానే ముందుండి అర ఎకరం పొలం కొనుగోలు చేసి పాఠశాలకు అందించారు. ఆ స్థలమే తరువాత ఆశ్రమ హైస్కూల్‌గా అభివృద్ధి చెందింది" అని తెలిపారు. జియావుద్దీన్ గారు యుటిఎఫ్ జిల్లా, రాష్ట్ర స్థాయిలో సేవలందించి విద్యారంగానికి ఎనలేని కృషి చేసిన ధన్యజీవి, అమరజీవి అని ఆయన కీర్తించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజబాబు, మాదిరెడ్డి రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి. ప్రసాద్, సుబ్బయ్య చౌదరి, డి.కృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు. సభలో దుర్గాప్రసాద్, కన్నయ్యలాల్, యాట్కాని సత్యనారాయణ, మల్యాల కిషన్ రావు, పరిటాల సుబ్బారావు, పంపన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





# చేయూత పింఛన్ల పెంపుకై ఎమ్మార్పీఎస్ మహా ధర్నా

- **ఎన్నికల హామీ ను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం - ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొక్కా వినేష్ మాదిగ**

**భద్రాచలం, సెప్టెంబర్ 20 (డీడీ9 వార్త)**

చేయూత పింఛన్ల పెంపు కోసం భద్రాచలంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా జరిగింది. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు భద్రాచలం మండల గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ ధర్నాకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొక్కా వినేష్ మాదిగ, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు గుండే సుహాసిని మాదిగ నాయకత్వం వహించారు.

మొదట గ్రామపంచాయతీ ఈవోకు మెమోరాండం సమర్పించి, చేయూత పింఛన్దారుల పెంపు అంశాన్ని ప్రస్తావించారు. ఈవో స్పందిస్తూ, ఉన్నతాధికారుల దృష్టికి ఈ డిమాండ్లను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

తరువాత జరిగిన మహా ధర్నాలో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొక్కా వినేష్ మాదిగ, "ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన చేయూత పింఛన్ పెంపు హామీని అమలు చేయకపోవడం పింఛన్దారులపై అన్యాయం" అని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పింఛన్ పెంపు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆయన హెచ్చరిస్తూ, "పింఛన్ల పెంపు ఆలస్యమైతే, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుతో జరిగే దశల వారీ ఉద్యమాలతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం చూపితే, కాంగ్రెస్ ప్రభుత్వం నేలకూలిపోవడం ఖాయం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంద నవీన్ మాదిగ, తిప్పనపల్లి సమత మాదిగ, సముద్రాల బుజ్జి మాదిగ, షేక్ బేగం, ఆదిలక్ష్మి, చేయూత పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు